క్లుప్తంగా

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలి



జనగామ రూరల్: పట్టణంలోని బాణాపురం రైల్వే ట్రాక్ పక్కన ఉన్న మూడు ఎకరాల స్థలం కార్మికులకు ప్రభుత్వం కేటాయించిందని, వారికి తక్షణమే స్థలాలు చూపించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 20 ఏళ్ల కిందట రిక్షా కార్మికలకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చి స్థలాలు చూపించలేదన్నారు. వారికి రూ.3లక్షల సహాయం అందించి సొంతింటి కల నెరవేర్చి ఆదుకోవాలని కోరారు. శ్రీను, లింగం, సాయి, ప్రకాష్, మునీర్, శ్రీను, ముత్తయ్య, నర్సయ్య, వెంకటమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవే లక్ష్యంగా ముందుకు

కొడకండ్ల: గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం వహిస్తూ సామాజిక సేవే లక్ష్యంగా ముందుకు సాగుతామని కొడకండ్ల ద యంగ్ మైండ్ యూత్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అందె మహేష్, ప్రశాంత్ తెలిపారు. సోమవారం యూత్ ఆధ్వర్యంలో రూపొందిచన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కోఆప్షన్ మెంబర్ నసీరుద్దీన్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు వెంకటనారాయణ, ఉపసర్పంచ్ రమేష్, జక్కుల ప్రభాకర్, వెంకన్న, చంద్రయ్యలచే ఆవిష్కరించారు. మల్లేష్, భిక్షపతి, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి



జనగామ రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను భారత కరెన్సీపై ముద్రించాలని ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరుపోతుల పర్శరామ్ సోమవారం భీమవరం క్యాంపు కార్యాలయంలో ఏపీ శాసనమండలి చైర్మన్ కె.మోషేన్ రాజును కలిసి వినతి పత్రం అందజేశారు. కె.విజయరావు, రావేల రవి, కొమ్ము రాజు, సిద్దులు, శ్రీను, ముసలయ్య ఉన్నారు.

పరామర్శ



కొడకండ్ల: మండలంలోని రేగులతండాకు చెందిన మాజీ సర్పంచ్ గుగులోత్ రామనాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం తండాకు చేరుకొని రామనాయక్ మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, విజయ్, నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి కాలిన గాయాలతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘన్‌పూర్‌కు చెందిన పిట్టల జ్యోత్స్న (35) సోమవారం మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. కుటుంబ కలహాలతో ఈనెల 9న పిట్టల జ్యోత్స్న ఇంట్లో ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..



స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక రైల్వేస్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫారంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మెట్ల కింద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం జరిగింది. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఫుట్ ఓవర్ బ్రిడ్జి మెట్ల కింద మృతదేహం ఉన్నట్లు స్థానిక రైల్వే సిబ్బంది సమాచారం అందించారని, మృతుడికి 25 నుంచి 30 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. బ్రిడ్జి మెట్ల కింద ప్లాట్‌ఫారంపై పడుకుని నిద్రలోనే మృతిచెంది ఉండవచ్చని, మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవన్నారు. మృతుడు తెల్లని టీషర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించినట్లు తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే కాజీపేట జీఆర్‌పీ వారిని 8106194194 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించామన్నారు.



దేవరుప్పుల: కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు గంగు సచ్చితానందమూర్తిశర్మ తదితరులు



దేవరుప్పుల: పంచకల్యాణ నోములో పాల్గొన్న భక్తులు



బచ్చన్నపేటలో ముగ్గులు వేస్తున్న మహిళలు



స్టేషన్‌ఘన్‌పూర్: కోలాటం ఆడుతున్న విద్యార్థులు



స్టేషన్‌ఘన్‌పూర్: ముగ్గు వేస్తున్న మహిళ

ఘనంగా మకర సంక్రాంతి

మకర సంక్రాంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తెల్లవారుజామునే ఇళ్ల ముంగిళ్లలో వివిధ రంగులతో ఆకర్షణీయంగా ముగ్గులు వేసి గొబ్బెలు పెట్టారు. పలురకాల పిండి వంటలు, బొమ్మల కొలువులు ఆడపడుచుల రాకతో ఇంటింటా సందడి వాతావరణం నెలకొంది. సోమవారం కనుమ పండుగను పురస్కరించుకొని బొమ్మలకొలువులు ఏర్పాటు చేసిన ముత్తైదువలు పాలు పొంగించి పిండివంటలను అష్టలక్ష్మికి నైవేద్యంగా సమర్పించి సంక్రాంతి నోములను వాయినాలుగా ఇచ్చిపుచ్చుకున్నారు. యువకులు, చిన్నారులు పతంగులు ఎగురవేస్తూ సంబురాలు చేసుకున్నారు. మహిళలు, యువతులు, చిన్నారులు స్థానిక దేవాలయాల్లో పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టగా ఆధ్యాత్మికత సంతరించుకొంది. పిల్లాపాపలు చల్లంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. సంక్రాంతి సందర్భంగా భక్తులు పలు ఫంక్షన్ హాళ్లలో పంచకల్యాణ నోములు, పంచవటి నోములు ఘనంగా నిర్వహించారు. అలాగే పలు సంఘాలు, అసోసియేషన్ల ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకొని క్రీడలు, ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని ఇప్పగూడెంలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్



స్టేషన్‌ఘన్‌పూర్: పంచవటి నోములో పాల్గొన్న భక్తులు



లింగాలఘణపురం: గెలుపొందిన జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎస్సై ప్రవీణ్



దేవరుప్పుల: ముగ్గులు వేస్తున్న మహిళలు, చిన్నారులు



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్



చిల్పూరు: బహుమతి అందజేస్తున్న ఏఎస్సై జయకుమార్



జఫర్‌గఢ్: ముగ్గు వేస్తున్న గృహిణి



నర్మెట: బొమ్మల కొలువు, పాలు పొంగిస్తున్న దృశ్యం



పాలకుర్తిటౌన్: నోములో పాల్గొన్న మహిళలు

ముగిసిన బంజరమల్లన్న జాతర



జాతరలో శివభక్తుల సందడి

దేవరుప్పుల: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని పెద్దమడూరు జోగు బ్రదర్స్‌చే బంజర శివారులో శివనామస్మరణంతో కొమురెల్లి కోరమీసాలను పోలిన శ్రీ మల్లిఖార్జునస్వామి బ్రహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఒగ్గు పూజారులు, కళాకారులు, పలు సామాజికవర్గాలకు చెందిన శివభక్తుల ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పరిసరాల గ్రామస్తులు పెద్దఎత్తున చేరి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర నిర్వాహక సమన్వయ కమిటీ ప్రతినిధి జోగు భిక్షపతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఆకవరం సృజనాపెద్దారెడ్డి, కవిత మధుసూదన్, వంగ పద్మవెంకటేశ్వర్లు, వైఎస్ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు గొడుగు సుజాతమల్లిఖార్జున్, పానుగంటి గిరి, కుర్మ సామాజిక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి



రఘునాథపల్లి: యువత విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని రూరల్ సీఐ సంతోష్ అన్నారు. మండలంలోని ఆంధ్రతండాలో రైజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి వాలీబాల్ ముగింపు పోటీలకు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ బన్‌సూర్య, బంజారాభాయ్ యూత్ అధ్యక్షుడు చంద్రశేఖర్, రైస్ యూత్ అధ్యక్ష, కార్యదర్శులు మాలోత్ రాజేశ్వర్‌నాయక్, భూక్య శ్రీను, హరికృష్ణ, రాజేష్, సినాద్రి, చంద్రశేఖర్, నరేందర్, రాజేష్, రవికుమార్, సంతోష్, సురేష్ పాల్గొన్నారు.

నియామకం

చిల్పూరు: బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సోషల్ మీడియా వారియర్స్ విభాగం నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన రంగు రమేష్‌ను నియమించినట్లు ఎమ్మెల్యే రాజయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగ రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన పదవితో పార్టీని మరింత బలోపేతం చేస్తానని అన్నారు.

పాలకవర్గాల వివక్ష తగదు

జనగామ: ఉమ్మడి రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు హయాంలో జనగామలో 100 పడకలు ఆస్పత్రి నిర్మించి ప్రారంభించిన శిలాఫలకంపై ప్రస్తుత పాలకవర్గం వివక్షత తగదని టీడీపీ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామిని హరీష్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభోత్సవం చేసిన శిలాఫలకంపై నోటీసుబోర్డు ఏర్పాటు చేయడం పట్ల నిరసిస్తూ దానిని తొలగించి క్షీరాభిషేకం చేసి పూలమాల వేశారు. జనగామ టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మయ్య, సురుగు సతీష్ గౌడ్, చీకట్ల నవీన్, పరకాల శ్రీనివాస్, తాళ్ళపల్లి ఏల్లేష్, బైరు బాబు, గడ్డం కృష్ణ, ఎండీ ఎక్బాల్, కాసర్ల లక్ష్మారెడ్డి, మాచర్ల భిక్షపతి, ఎండీ సిరాజ్, ఆంజనేయులు, రమేష్, కొణిదల కిషన్ ప్రసాద్, సుద్దాల సురేష్, కడారు అంజనిలు, కొంత రమేష్ ప్రవీణ్ పాల్గొన్నారు.



శిలాఫలకానికి పూలమాల వేసిన నాయకులు

సంక్షిప్త సమాచారం

కాంగ్రెస్ మండల నూతన అధ్యక్షుడి కోసం సమావేశం

రఘునాథపల్లి: కాంగ్రెస్ మండల నూతన అధ్యక్షుడి కోసం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో సోమవారం పార్టీ ముఖ్య నాయకుల ప్రత్యేక సమావేశం జరిగింది. అధిష్టానం ఆదేశాల మేరకే సమర్ధుడైన మండల అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు సన్నాహక సమావేశం ఏర్పాటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడిగా పని చేసేందుకు ఆసక్తి గల వారి నుంచి పేర్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 18న మరోసారి సమావేశం ఏర్పాటు చేసి నూతన మండల అధ్యక్షుడి కోసం ఆశావాహనుల నుంచి పేర్లు తీసుకొని రాష్ట్ర పార్టీకి నివేదిస్తామని తెలిపారు. నిడిగొండ పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, నాయకులు నాగేశ్వర్, లింగాజి, రామ్మూర్తి, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జ్ఞాన జ్యోతుల కార్యక్రమం

జనగామ రూరల్: పెంబర్తిలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ నిర్మాల రత్నం ఆధ్వర్యంలో చేపడుతున్న జ్ఞాన జ్యోతుల కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం నాటికి 52వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామస్తులు, యువత, ప్రజా ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కర్ణాకర్, శ్రీనివాస్, శ్రీకాంత్, హరిబాబు పాల్గొన్నారు.

మాయావతి జన్మదిన వేడుకలు



జనగామ రూరల్: బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి జన్మదినోత్సవ వేడుకలను ఆ పార్టీ జనగామ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేరిపోతుల కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ నిర్మాల రత్నం కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పట్టణ ఇన్‌చార్జ్ రొడ్డ సుధాకర్, ఎం.చంద్రశేఖర్, శంకర్, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా జనకల్యాణ్ దివస్

చిల్పూరు: కొండాపూర్‌లో ఆదివారం జనకల్యాణ్ దివస్‌ను పురస్కరించుకుని బీఎస్పీ గ్రామ శాఖ అధ్యక్షుడు మోతె కొంరయ్య అధ్యక్షతన జిల్లా ఇన్‌చార్జ్ నిర్మాల రత్నం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి వెంకటస్వామి, సురేష్‌యాదవ్, రాహుల్‌రాయ్, రజని, చక్రపాణి, దీపక్, కుమార్, చంద్రశేఖర్, ముత్యాల కుమార్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట: ఇటుకాలపల్లిలో పేద కుటుంబానికి చెందిన కొలుగూరి ఎల్లమ్మ మృతి చెందడంతో అంత్యక్రియలకు ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు, గ్రామ ఎంపీటీసీ దూడల కనుకయ్యగౌడ్ రూ.5వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

లింగాలఘణపురం: మండలంలోని 21 పంచాయతీలకు ఎన్ఆర్ఈజీఎస్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2.10 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎంపీపీ చిట్ల జయశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొడకండ్ల: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1999–2000 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకొన్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులు, పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకొని ఆనందంగా గడిపారు. తమ గురువులకు వెండి పెన్నులను బహూకరించి సన్మానం చేశారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సిల్వర్ జూబ్లీ వేడుకలు..

రఘునాథపల్లి: మండలంలోని వెల్దిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1997–98 ఏడో తరగతి బ్యాచ్‌కు చెందిన ఆనాటి బాల్య స్నేహితులు సోమవారం అదే పాఠశాలలో కలుసుకొని ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించుకున్నారు. ఒకరికొకరు కరచాలనాలు, అలింగనాలతో పట్టరాని ఆనందంతో గడిపారు. తమను విద్యావంతులుగా తీర్చిదిద్ది ఎదుగుదలకు కారకులైన గురువులను శాలువాలతో సత్కరించి పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కొడకండ్ల: గురువులతో పూర్వ విద్యార్థులు



రఘునాథపల్లి: వెల్ది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

రఘునాథపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్పీఓ పార్థసారథి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 19న ప్రారంభించనున్న కంటి వెలుగు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కంటి సమస్యతో బాధపడుతున్న వారిని గుర్తించి కంటి వెలుగు శిబిరానికి తరలించి పరీక్షలు చేయించాలని సూచించారు. సర్పంచ్ పోకల శివకుమార్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు నీలం వాసు, చీమలపాటి రామారావు, లింగారెడ్డి రాయపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎల్పీఓ

డ్రెయినేజీ సమస్యపై పాలకుల నిర్లక్ష్యం

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన ఘన్‌పూర్ ఎస్సీ కాలనీలో 15వ వార్డులో ఏళ్ల తరబడి డ్రైనేజీ సమస్యపై పాలకులు, గ్రామ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వార్డు ప్రజలు గద్దల యాదగిరి, టి.దేవదానం, సీహెచ్.రాజమ్మ అన్నారు. వార్డు ప్రజలు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ డ్రెయినేజీ సమస్యను వివరించారు. వార్డులో డ్రెయినేజీ సౌకర్యం లేక జనవాసాల మధ్య మురుగునీరు నిలిచి తీవ్ర దుర్గంధం వ్యాపిస్తుందన్నారు. ఎగువన ఉన్న 16వ, 1వ వార్డుకు చెందిన డ్రెయినేజీ నీరంతా 15వ వార్డులో నిలుస్తుందని, మురుగునీరంతా చేరి చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయన్నారు. పలుమార్లు స్థానిక సర్పంచ్, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. టి.ప్రభాకర్, డి.నర్సయ్య, టి.లలిత, మేడ బాబు, సుందరమ్మ పాల్గొన్నారు.



మురుగునీటి గుంతను చూపిస్తున్న వార్డు ప్రజలు

పార్టీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న రాంకోటి

జనగామ రూరల్: బూత్ స్థాయిలో బీజేపీ పార్టీని బలోపేతం చేయాలని గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బానోత్ రాంకోటి అన్నారు. సోమవారం మండలంలోని అడవికేశవాపూర్‌లో కమిటీ ఏర్పాటు చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పోరెల్ల మల్లేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శానబోయిన మహిపాల్, గణేష్, రాజు, అరుణ్, విజయ్‌కుమార్, యాకయ్య, నర్సిహులు, సాయికిరణ్, మల్లయ్య, నవీన్, తిరుమలేష్, భాస్కర్, రాజేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

చిల్పూరు: చిల్పూరు గుట్ట కింది ప్రజల సమస్యల పరిష్కారంలో దేవాదాయ శాఖ ఈఓ విఫలమయ్యారని సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్‌తో పాటు స్థానికులు పంతం రాజ్‌కుమార్, గొల్లపల్లి వాసు, తొటి సునీల్, నంగునూరి పుష్పమ్మ ఆరోపించారు. సోమవారం వారు మాట్లాడుతూ చిల్పూరు ఆలయం ఎండోమెంట్‌లో లేనపుడు జీపీ అనుమతితో నిర్మించుకున్న 150 ఇళ్లు ఉండేవి. ప్రస్తుతం ఈఓ దేవాదాయ శాఖ ఆదేశాల పేరుతో ఇళ్లను కూల్చి వేశారని, రెంట్ కడితేనే ఉండాలని హెచ్చరించడంతో ప్రస్తుతం పన్ను కడుతున్నా సౌకర్యాలు కల్పించడం లేదని అన్నారు. ఇటీవల దేవాలయ భూసర్వే పేరుతో కొలతలు వేసి ఖనీలు పాతగా వాటిని కొందరు తొలగించి కబ్జాకు పాల్పడుతున్నా పట్టించుకోవడం లేదని, వారిని వదిలి మళ్లీ నిరుపేదల ఇళ్లను తొలగించాలంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. కల్లూరి మధుసూదన్, సాంబశివరాజు, సారయ్య, జిల్లా రాజు, మోహన్,నాసు రవి, మూలనాగరాజు, యాటలక్ష్మి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్, స్థానికులు